ప్రజాశక్తి
గురువారం 4 మే 2023 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సాయానికి నోచని నష్టం

- రైతులను ముంచిన అకాల వర్షాలు
- పంట కోతల అనంతరం నష్టాలకు దక్కని పరిహారం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పెదకూరపాడులో మిర్చిపంటపై కప్పిన పట్టాలు

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో అకాల వర్షాలు కొనసాగుతున్నాయి. ఇవి ఇంకా వారం పాటు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. రబీలో సాగు చేసిన వరి, జొన్న, జొన్న, అపరాలు, ఉద్యాన పంటలకు అకాల వర్షాలు తీవ్ర నష్టం కలిగించాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన మిర్చి, పసుపు, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలంలో 15 ఎకరాల్లోనే అరటి తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. పల్నాడు జిల్లాలో కోయకుండా ఉంచి వరి పంట 675 ఎకరాల్లోనే నష్టం జరిగిందని అధికారులు నివేదిక రూపొందించారు. పల్నాడులో 75 ఎకరాల్లోనే మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని నిర్ధారించారు. రైతులకు జరిగిన నష్టంలో నిబంధనల ప్రకారం సాయం అందే అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

▶ 2లో

వర్షపాతం ఇలా..

బుధవారం జిల్లాలోని వివిధప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీవర్షం కురిసింది. పత్తిపాడు, మంగళగిరి, తెనాలి, గుంటూరు, పొన్నూరు తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మిర్చి, మొక్కజొన్న పంటలకు నష్టం జరిగింది. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు నమోదైన వర్షపాతం వివరాలు... గురజాల 40.2. మిల్లీమీటర్లు, దాచేపల్లి 28.2, కారంపూడి 63.6, పిడుగురాళ్ల 80.2, మాచవరం 30.4, బెల్లంకొండ 38.2, అచ్చంపేట 22.6, క్రోసూరు 24.6, అమరావతి 40.8, గుంటూరు 24.8, పొన్నూరు 23.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రాస్తారోకో చేస్తుండగా గుంటూరు, నరసరావుపేటలో సిపిఎం, సిఐటియు నాయకులు పాశం రామారావు, కె.నళినీకాంత్, గుంటూరు విజయ్‌కుమార్, ముజఫర్ అహ్మద్ తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉధృత ఉద్యమాలు

వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకుల ఉద్ఘాటన - గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రాస్తారోకోలు - పలుచోట్ల నాయకుల బలవంతపు అరెస్టులు

వార్తలు లోపలి పేజీల్లో

సదస్సులో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

పసుపు రైతులను ఆదుకోండి

సంఘటిత పోరాటాలకు సిద్ధం కండి - దుగ్గిరాల సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో పసుపు పంటకు మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం క్వింటాళ్ రూ.10 వేలకు కొనుగోలు చేయాలని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన దుగ్గిరాలలో పసుపు రైతుల రాష్ట్ర సదస్సు బుధవారం నిర్వహించారు. సదస్సుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షత వహించారు. హరిబాబు మాట్లాడుతూ పసుపు సాగు వల్ల కేంద్ర ప్రభుత్వానికి రూ.1700 కోట్ల విదేశీ మారకద్రవ్యం వస్తుండగా రైతుల సంక్షేమానికి మాత్రం 1700 పైసలు కూడా అందడం లేదన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా కింద రూ.13,500 ఇచ్చి చేతులు దులుపుకొంటోందని, రైతులకు ఏ సమస్య వచ్చినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పసుపు రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఖర్చయితే ఆదాయం రూ.లక్ష కూడా రావడం లేదన్నారు. విత్తనం సరఫరా నుంచి పంట కొనుగోలు వరకు అన్ని ఆర్‌బికేలే చూస్తాయన్న ప్రభుత్వం ఎన్ని ఆర్‌బికేల్లో పసుపు కొనుగోలు చేసిందో చెప్పాలన్నారు. కేరళలో

▶ 2లో

తాలుగాయగా మారిన మిర్చిని నాయకులకు చూపుతున్న మహిళా రైతులు

నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

- పొలాలను పరిశీలించిన రైతు, కౌలురైతు సంఘాల నాయకులు
- నిండా మునిగామని మహిళా రైతుల ఆవేదన

ప్రజాశక్తి - నరసరావుపేట

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల్లో పొలాలు, మిర్చి కల్లాలను రైతు, కౌలురైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. నాయకుల ఎదుట మహిళా రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొంటుందనే ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదని అన్నారు. వర్షాల నేపథ్యంలో మిర్చి పంట పూర్తిగా కళ్లాల్లో ఉండి తాలూకాయిలుగా మారాయని, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, వరి నీటిలో మునిగి గింజలు మొలకెత్తడం వల్ల ఆ ధాన్యాన్ని కొనేవారు లేక రైతులు దీనావస్థలో ఉన్నారన్నారు. పసుపు , మొక్కజొన్న ధరలు సగానికి సగం పడిపోయాయని,అరటి, బొప్పాయి, మామిడి లాంటి పంటలు పూర్తిగా నేలపాలయ్యాయని చెప్పారు. ఈ నేపథ్యంలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతుకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. పొరుగు

▶ 2లో

చనిపోవడానికి ముందు గాయాలతో జేమ్స్

వివాహేతర సంబంధం నేపథ్యంలో

యువకుని దారుణ హత్య

ప్రజాశక్తి - నరసరావుపేట

వివాహేతర సంబంధాల నేపథ్యంలో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన మండలంలోని అల్లూరివారిపాలెంలో బుధవారం వెలుగు చూసింది. స్థానికులు, పోలీసుల వివరాలు ప్రకారం.. అల్లూరివారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన గుంటూరు జేమ్స్ (30) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో స్థానిక మహిళతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో ఇరు కుటుంబాలకు మూణ్ణెల్లుగా వివాదలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యువతి కుటుంబీకుల్లో ఒకరైన కంచిపోగు ప్రభుదాస్ మరి కొందరు కలిసి మంగళవారం రాత్రి 7 గంటలప్పుడు ఆటోలో నరసరావుపేట నుండి అల్లూరివారిపాలెం వెళుతున్న జేమ్స్‌ను అడ్డుకున్నారు. అనంతరం జేమ్స్‌ను అదే ఆటోలో కొట్టుకుంటూ 11 గంటల వరకూ ఆటోను ఆ చుట్టుపక్కల పొలాల చుట్టూ తిప్పారు. జేమ్స్ శరీరంలోని పలుచోట్ల కత్తులతో కోశారు. అనంతరం ఒంటిగంట తర్వాత

▶ 2లో

విద్యార్థినికి గాయాలపై సమగ్ర విచారణ

గాయపడిని గురుకులం విద్యార్థినిని పరామర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - నరసరావుపేట

లక్ష్మీభాయ్‌ను పరామర్శిస్తున్న శంకర్ నాయక్

గురుకులంలో వంట పాత్రలు మోస్తున్న సందర్భంలో వంటిపై వేడి రసం పడి తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ బుధవారం పరామర్శించారు. బొల్లాపల్లి మండలం మన్నేపల్లి తండాకు చెందిన రామావత్ లక్ష్మీబాయి వినుకొండలోని గిరిజన సంక్షేమ బాలిక గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. గతనెల 26న రాత్రి వసతిగృహంలో భోజనాలకు సంబంధించి వండిన పాత్రలను తోటి విద్యార్థినులతో కలసి మోసుకొస్తుండగా వేడిగా ఉన్న రసం లక్ష్మీబాయి పైన పడి చేయి, శరీరంలోని ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. దీంతో వెంటనే నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి వెళ్లడంతో క్షతగాత్రురాలిని కమిషన్

▶ 2లో

యువకుని దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

జేమ్స్‌ను, ఆటోను రొంపిచర్ల రోడ్డు అన్నవరం గ్రామం వద్ద వదిలేసి పరారయ్యారు. మరోవైపు ఇంటికి వస్తున్నట్లు తమకు 7 గంటలకు ఫోన్ చేసిన జేమ్స్ ఇంకా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేశారు. ఫోన్ లిఫ్ట్ అయినా జేమ్స్ మాట్లాడకపోవడం, ఇతరుల మాటలు గందరగోళంగా వినపడుతుండడంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అన్నవరంలో ఉన్నట్లు గుర్తించి అర్ధరాత్రి ఒంటిగంట తర్వాతఘటనా స్థలికి చేరుకున్నారు.

రక్తపు మడుగులో పడి ఉన్న జేమ్స్ గమనించి నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గుంటూరుకు తీసుకెళ్లాలనే వైద్యుల సూచనలతో తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హాజరత్తయ్య తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రమైన తెలంగాణ తక్షణసాయంగా ఎకరాకు రూ.10 వేలు ప్రకటిస్తే, మన రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. మిర్చికి ఎకరాకు రూ.లక్ష, మిగతా పంటలకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ సాగుదారుల్లో ఎక్కువమంది కౌలు రైతులు ఉన్నారని, వారికి ఎటువంటి సాయం ప్రభుత్వ నుండి అందటం లేదని అన్నారు. ఈ-క్రాప్ నమోదులోనూ కౌలు రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం కౌలు రైతులందరికీ పంటల బీమా పథకం ద్వారా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో నాయకులు కె.ఆంజనేయులు, మహిళా రైతులు ఆవులమ్మ, గంగమ్మ, శివపార్వతి, పెద్దబ్బాయి పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో యరపతినేని శ్రీనివాసరావు

మాచవరంలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - మాచవరం

మండలంలోని గాంధీనగర్‌లో బుధవారం నిర్వహించిన 'ఇందేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యాక్రమంలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నియోజకవర్గంలో 9 మంది టిడిపి నాయకులను హత్య చేయించారని, అక్రమ క్వారీయింగ్ గుంతల్లో పడి 8 మంది చిన్నారులు చనిపోయారని చెప్పారు. మహిళలపై అత్యాచారాలు, బలహీన వర్గాలపై దాడులు, అక్రమ కేసులు, ఆస్తులను ధ్వంసం నిత్యకృత్యమయ్యాయని విమర్శించారు. కూలి పనులు చేసుకుంటున్న వడ్డెర కార్మికులు కూలి డబ్బులు అడిగారని కత్తులతో విచక్షణారహితంగా పొడిచారన్నారు. 40 మంది కాళ్లు, చేతులు విరగొట్టి వారిని గ్రామంలో ఉండకుండా చేయడంతో వారి పొలాలు బీళ్లయ్యాయని, ఇంతటి అకృత్యాలకు పాల్పడుతున్న పార్టీని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని అన్నారు.

విద్యుత్ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ ఉద్యోగులకు,పెన్షనర్లకు వేతనాలు,పెన్షన్లు వెంటనే చెల్లించాలని సిఐటియు అనుబంధ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) ఎపిసిపిడిసిఎల్ డిస్కం కమిటీ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు రోజురోజుకు సమస్యలు, పనిభారం పెరుగుతుందన్నారు. 24/7 నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయటంలో, వినియెగదారులకు విద్యుత్ సేవలందించటంలో, 100శాతం రెవెన్యూ వసూళ్ళలో, సంస్థ పురోభివృద్ధికి ఉద్యోగులందరూ కష్టపడి పనిచేస్తున్నారన్నారు. విద్యుత్ సంస్థ నష్టాలకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. ఈ దుస్థితికి భాద్యత వహించాల్సింది కూడా ప్రభుత్వమేనన్నారు. నష్టాల సాకుతో ప్రతినెలా 1వ తేదీన చెల్లించాల్సిన వేతనాలు ,పెన్షన్లు సకాలంలో చెల్లించకపోవటం, ప్రతినెలా జాప్యం చేయటం సమంజసం కాదన్నారు. ఈ కారణంగా ఉద్యోగులు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లింపులు చేయకపోవటంతో పెనాల్టీల భారం, క్రెడిట్ స్కోర్‌పై ప్రభావం పడుతుందని తెలియజేశారు. ఇంటి అద్దెలు, పాలు తదితర నిత్యావసరాలకూ ఇబ్బంది పడాల్సి వస్తుందని, తక్షణమే ఏప్రిల్ వేతనం చెల్లించాలన్నారు. ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు, పెన్షన్లు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-తెనాలి

విద్యుత్ కార్మికులకు ఏప్రిల్ నెలకు సంబందించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి డివిజన్ విద్యుత్ అధికారులకు యూనియన్ తరపున కార్మికుల వేతనాల చెల్లింపు కోరుతూ బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ దశాబ్దాల నుంచి కార్మికులకు వేతనాల చెల్లింపులో మంచి పేరున్న విద్యుత్ సంస్థ గత కొంత కాలంగా నెలలతరబడి వేతనాల చెల్లింపులో జాప్యం చేస్తుందన్నారు. ఫలితంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి సకాలంలో బిల్లులు రాబట్టుకుంటున్న సంస్థ, కార్మికులకు వేతనాలు చెల్లించటంలో జాప్యం ఎందుకని ఆయన ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి, వేతనాల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలన్నారు.

సాయానికి నోచని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

పంటలు కోసిన తరువాత వర్షాలకు నష్టం జరిగినా పరిహారం దక్కే అవకాశం లేదని అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం మిర్చి, జొన్న, మొక్కజొన్న కోసం కళ్లాల్లో ఆరబెట్టే పరిస్థితి నెలకొంది. ఇందువల్ల ఈ రైతులకు పరిహారం లభించే అవకాశం లేదంటున్నారు.

గుంటూరు జిల్లాలో రబీలో 23 వేల ఎకరాల్లో జొన్న, 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 82వేల ఎకరాల్లో ముతకధాన్యాలు, శనగ 18 వేల ఎకరాల్లో, పెసర 20 వేల ఎకరాల్లో, మినుము 11 వేల ఎకరాల్లో వేశారు. వీటిల్లో 20 శాతం పంట చివరి కోతల సమయంలో అకాల వర్షాలవల్ల నష్టంజరిగిందని అధికారులు అంచనావేసినా వీటికిసాయం అందదని చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో వరి 50 వేల ఎకరాలు, మొక్కజొన్న 34 వేల ఎకరాలు, ముతక ధాన్యాలు 30 వేల ఎకరాలు, శనగ 19 వేల ఎకరాల్లో సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో పంట కోత దశలో ఉండగా మరి కొన్ని ప్రాంతాల్లో కోసి కుప్పలు వేసి ఉంచగా వర్షాల వల్ల తడిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా నాలుగో విడత కోసిన మిర్చి కళ్లాల్లో ఆరబోసి ఉంచగా వర్షాలకు తడిసి నష్టం వాటిల్లింది. ఆలస్యంగా సాగు చేసిన ప్రాంతాల్లో నాలుగో విడత కోత పూర్తి కాకుండానే పంట దెబ్బతింటోంది.

విద్యార్థినికి గాయాలపై సమగ్ర విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు శంకర్‌నాయక్ ఆస్పత్రిలో బుధవారం పరామర్శించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించడంతోపాటు న్యాయం చేస్తామని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చూసుకుంటామని చెప్పారు. అనంతరం కలెక్టర్‌కు దీనిపై వివరించి సమగ్ర విచారణ కోరారు. ఈ ఘటనకు కారణమైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవావాలన్నారు. విచారణ చేయించి నివేదికను ఎస్టీ కమిషన్‌కు పంపుతామని కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఎల్.వరలక్ష్మి, నరసరావుపేట తహశీల్దార్ రమణానాయక్ పాల్గొన్నారు.

పసుపు రైతులను ఆదుకోండి

(మొదటి పేజీ తరువాయి)

అన్నిరకాల పంటలకు కేంద్రం మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం కొంత బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తోందని తెలిపారు. మద్దతు ధరలు, సౌకర్యాల కోసం రైతులు సంఘటితంగా పోరాడాలన్నారు. రైతులను నిర్వీర్యం చేసి సాగుపై విసుగుపుట్టించి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఇదే రీతిలో కృష్ణా జిల్లా నందివాడ మండలంలో ఐదువేల ఎకరాలను జెవిఎస్‌కంపెనీ తీసుకుని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ పంటల కొనుగోలుకు ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రప్రభుత్వం క్రమంగా దూరం చేస్తుందన్నారు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ వ్యవస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా రైతులకు సాగుపై విసుగు పుట్టించేలా పాలకులు వ్యవహరిస్తున్నారని అన్నారు. సహకార రంగంలో కూడా 50 శాతం ప్రైవేటుపెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా ప్రభుత్వ రంగంలో కూడా సహకార సంఘాన్ని దెబ్బతీస్తున్నారని వివరించారు. తమ హక్కులకోసం ప్రభుత్వ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు, ఇతర తరగతుల వారు ఎలా పోరాడుతున్నారో రైతులు కూడా సంఘటితంగా పోరాటడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకు ఢిల్లీ సరిహద్దులో 13 నెలలపాటు జరిగిన రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు నాయకులు డి.వెంకటరెడ్డి, వి.వెంకటరామయ్య, వి.సాంబశివరావు, జె.బాలరాజు, నాగమల్లేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, సిహెచ్ పోతురాజు పాల్గొన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-ఫిరంగిపురం

గత మూడు నెలలుగా పాడైపోయిన తాగునీటి బోరును తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ 24 గంటల్లో రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఫిరంగిపురం మండలం మునగపాడు గ్రామంలో తాగునీటి బోరు పంపు చెడిపోవటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. సమస్యను మే రెండో తేదీన తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ దృష్టికి గ్రామస్తులు, వైసీపీ నాయకులు ఎం రామిరెడ్డి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన సురేష్ కుమార్ అధికారులతో మాట్లాడి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు 24 గంటల్లో మరమ్మతులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. గ్రామస్తులు సురేష్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దుమ్ములేపుతున్న అనాధికార క్రషర్

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని ముగ్గురోడ్డు పక్కనే అనధికారికంగా మినీ క్రషర్‌ను ఏర్పాటు చేసి పెద్ద గుట్టలుగా పోసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో కంకర ఆడించే సమయంలో, లోడింగ్ సమయంలో దుమ్ము ఇళ్లను చుట్టుముడుతుందని స్థానికులు వాపోతున్నారు. పాత మంగళగిరి జాతీయ రహదారిపై తిరిగే వాహనదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు తెలిపారు. దుమ్ము వల్ల ఒక రకమైన శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి వేబిల్లులు లేకుండా దర్జాగా అనధికార వ్యాపారం చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ కట్టపై అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

నిర్మాణంలో ఉన్న అక్రమ కట్టడాలు

సిఎం ఇంటికి కూతవేటు దూరంలో అంబేద్కర్ కాలనీ (యానాదుల కాలనీ) దాటిన తరువాత కాలువ కట్టపై అక్రమ నిర్మాణాలు యధేచ్ఛగా జరగు తున్నాయని స్థానికులు వాపోతున్నారు. విజయవాడకు చెందిన కొంత మంది వ్యాపారస్తులు ఈ ప్రాంతంలో ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించి గోడౌన్లను ఏర్పాటు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో కోట్లాది రూపాయల విలువైన సరుకును నిల్వచేసి ఇతర ప్రాంతాలకు సరుకును తలిస్తున్నారు. సహజంగా కాలువ కట్టపై పేదవాడు ఇల్లు వేస్తే వెంటనే తొలగించే అధికారులు కార్పొరేట్లు భారీ ఎత్తున షెడ్లు నిర్మిస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడంలేదని అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఉప్పలపాడులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని ఉప్పలపాడులో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. స్థానిక సమస్యలుంటే అడిగారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వర్‌రెడ్డి, మేకల కోటిరెడ్డి, పాలవాయి వెంకటయ్య, మంద సీతారామిరెడ్డి, కర్పూరపు నారపరెడ్డి, సచివాలయం కన్వీనర్ల కాయకుల రాజయ్య పాల్గొన్నారు.

తెనాలి బోస్‌రోడ్డులో రహదారిపై నాటిచిన నీరు

ప్రత్తిపాడులో మిర్చిపై కప్పిన పట్టాలు

కొల్లిపరలో మొక్కజొన్న కండెలను పరిశీలిస్తున్న ములక శివసాంబిరెడ్డి

రైతు కష్టం.. కళ్లాల్లోనే నష్టం..

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ఏడాది మొత్తం రైతులుపడ్డ కష్టం కళ్ళాల్లోనే కన్నీరైంది. వరుసగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు అల్లాడి పోతున్నారు. మిర్చి రైతులు అయితే కంటిపై కునుకు లేకుండా ఆరబోసిన మిరపకాయలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు అయినా తగ్గని వర్షాలకు రైతు కుదేలు అవుతున్నాడు. తాలు ఏరిద్దామని కూలి పనులకు పిలిచిన వారిని తాలు ఏర్పిస్తున్న అప్పటికప్పుడు మబ్బులు చేసి వర్షం పడటంతో పరదా పట్టాలు కప్పుకోవటం ,ఎండ రాగానే పరదాలు తీయటం జరుగుతుంది. బుధవారం కురిసిన వర్షాలకు రైతులు వారు పరదాలు కప్పుకునే లోపే వర్షం అకస్మాత్తుగా రావడంతో ఆరబోసి ఉన్న మిరపకాయలు కొంతమేర తడిచిపోవడం జరిగింది. మంచి మిరపకాయలు కాస్త తడిసి తాలు కాయలు అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఈ వర్షాలకు మిర్చి రైతు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి కూలి వాళ్ల కూడా దొరకపోవడంతో ఒకవేళ వచ్చినా వారికి కూలి కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాల వలన పంట పండినగాని నష్టాలను సవి చూడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . ప్రభుత్వం ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు

తెనాలిలో భారీ వర్షం

ప్రజాశక్తి-తెనాలి: పట్టణంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. 11 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం దాదాపు గంట సేపు ఎడతెరిపి లేకుండా కురిసింది. వర్షానికి బోస్‌రోడ్డులోని స్వరాజ్ కూడలి, పొట్టి శ్రీరాములు విగ్రహ కూడలి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డు, బుర్రిపాలెం రోడ్డు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా వర్షాలు పడుతున్న నేపధ్యంలో వర్షం ప్రారంభంలోనే కాలువలు నిండిపోయాయి. కాలువల్లో బురద రోడ్డుపైకి వచ్చి తీవ్ర దుర్గంధం వెదజల్లింది.

ప్రజాశక్తి - కొల్లిపర

అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతుగా ప్రకటించి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మున్నంగి వల్లభాపురం పిడపర్రు పెడపర్తి పాలెం గ్రామాల్లో రైతు నాయకులు వంగా శివశంకర్‌రెడ్డితో కలిసి పొలాల్లోని వర్షానికి తడిసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా దిక్కుతోచని స్థితిలో రైతులు ఆల్లాడుతుంటే ఏ ఒక్క అధికారి కానీ ప్రజాప్రతినిధులు కానీ వచ్చి దెబ్బతిన్న పొలాలను చూసిన పాపాన పోలేదని రైతులు రైతు సంఘం నాయకుల ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము మీనమేషాలు లెక్కించకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిచిన మొక్కజొన్న పసుపును మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

తెనాలిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తక్షణమే పంట నష్టం అంచనా వేయాలి : ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి, కొల్లూరు

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం అదుకోవాటని, తక్షణమే పంటనష్టాన్ని అంచనా వేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను తెనాలి, కొల్లిపర మండలాల్లో పర్యటించి పరిశీలించారు. జొన్నా, మొక్కజొన్నకు పెట్టుబడులు, దిగుబడి, నష్టం తదితర వివరాలను రైతుల ద్వారా తెలుసుకున్నారు. కనీసం ఇప్పుడైనా తడిసిన జొన్న, మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పంటనష్టం అదించి రైతులను ఆదుకోవాలన్నారు. లేని పక్షంలో రైతులపక్షాన ఆందోళన తప్పదని హెచ్చరించారు.కొల్లూరు మండలంలో దావులూరు, అత్తోటలో రైతులు పలు సమస్యలను ఆలపాటికి వివరించారు. కార్యక్రమాల్లో శాఖమూరి నారాయణ ప్రసాద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, భీమవరపు చిన్న కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితులు అరెస్టు

రూ.10 లక్షల విలువ చేసే 8 వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - కొల్లిపర: ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు తెనాలి రూరల్ సీఐ కే శ్రీనివాస్ రెడ్డి బుధవారం కొల్లిపర పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు జిల్లాలోని కొల్లిపర పోలీస్ స్టేషన్ పరిధిలో 1బీ తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మంగళగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 , దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో 2, ఫిరంగిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో 1, వాహనాలను చోరీ చేసేందుకు పాల్పడ్డారని తెలిపారు నిందితులు మండలంలోని దావులూరు అడ్డరోడ్ వద్ద ఉన్నట్లు సమాచారంతో గుంటూరు సిసిఎస్ పోలీసుల సహకారంతో తెనాలి రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొల్లిపర ఎస్సై ఆర్ రవీంద్రారెడ్డి సిబ్బందితో దాడి చేసి యువకులను అదుపులోనికి తీసుకుని విచారించగా వారు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 8 బైకులు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.10 లక్షల20 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. నిందితులు తెనాలి మండలం కట్టివరం గ్రామానికి చెందిన బండి కల్లా దాయకుమార్(21), గోవతోటి రత్నబాబు(19), పల్లెకొండ దుర్గాప్రసాద్(25)లుగా గుర్తించామన్నారు. జల్సా లకు అలవాటు పడి సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలని చోరీలకు పాల్పడినట్లు వారు తెలిపారు అన్నారు ముద్దాయిల అరెస్టుకు సహకరించిన కొల్లిపర స్టేషన్ ఎస్ఐ ఆర్ రవీంద్రారెడ్డి ఏఎస్ఐ పోతురాజు హెడ్ కానిస్టేబుళ్ల తాతారావు కానిస్టేబుళ్ల కూర్మారావు విజయ్ కుమార్ చంద్ర కుమార్ లను సీఐ కే శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ కే శ్రీనివాస్ రెడ్డి

మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,12,240
మిర్చి ఎగుమతి	:	1,17,725
మిర్చి నిల్వ	:	68,901

మిర్చి ధరలు

రూపాయలలో

334	9000 - 21500
నెం.5	13500 - 20000
273	11000 - 19000
341	9000 - 26500
4884	11000 - 17500
సూపర్ -10	15000 - 20900
నాన్ ఏసి	
తేజ	9000 - 23500
బడిగి	10000 - 24000
దేవనూరుడీలక్స్	10000 - 21500
తాలుకాయలు	5000 -13000

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మంగళగిరి

పట్నంలోని టిప్పర్ల బజార్లో రోడ్డుపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం షేక్ మహబూబ్ జిలాని (43) దివ్యాంగుడిగా ఉంటూ కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. మతిస్థిమితం కూడా సరిగా ఉండదని తెలిసింది. బుధవారం రాత్రి రోడ్డుపై మృతి చెంది ఉన్నాడు. స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ మహేంద్రా సంఘటనా స్థలాన్ని చేరుకొని మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి జాతీయరహదారిపై బుధవారం గుర్తుతెలియన వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం ద్విచక్రవాహనంపై విజయవాడ వైపు నుండి గుంటూరువైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపైవెళుతున్న యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు.మృతుడు ప్రకాశం జిల్లాకు చెందిన మరియబాబుగా పోలీసులు గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బహిరంగ ప్రకటన

వెల్లంపల్లి శిరీష W/o లీలా అజయ్‌కుమార్, చిలకలూరిపేట కాపురస్తులు వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్ చిలకలూరిపేట కాపురస్తులైన కుమ్మెత వెంకటరెడ్డి S/o నాగిరెడ్డి 18-3-2023 తేదీన వారి తాలూకు ఆస్థిని విక్రయ అగ్రిమెంటు వ్రాయించుకొనియున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింక్ డాక్యుమెంట్ అయిన 3/5/2010 3394/2010 దాఖలా తియ్యగూర కోటేశ్వరమ్మ భర్త సుబ్బారెడ్డి, తియ్యగూర హనిమిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి వారు ఫణిదపు శ్రీనివాసరావు S/o వేమయ్య పేరిట వ్రాయించియున్న Sale cum GPA ఒరిజినల్ దస్తావేజులు పోయినదని నా క్లయింట్ తెలిపియున్నారు. కావున సదరు 3/5/2010 ద.నెం.3394/2010 దాఖలా Sale cum GPA గురించి ఎవరికైనా అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల తెలియజేయ గలరు.

ఇట్లు
మట్టుపల్లి వెంకటసుబ్బారావు,
అడ్వకేటు,
అరండల్‌పేట, గుంటూరు.

ఏపీ సచివాలయ పోస్ట్‌మెన్ మృతి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ఏపీ సచివాలయ పోస్ట్ మెన్ ప్రమాదవశాత్తూ తన ద్విచక్రవాహనంతో సహా చెరువులోకి దూసుకువెళ్లి దుర్మరణం చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నగరంలోని పాత మంగళగిరికి చెందిన జె. కేశవరావు(62) వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో పోస్ట్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు మాదిరి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఏపీ సచివాలయానికి బయలు దేరాడు. మార్గమధ్యలోని యర్రబాలెం చెరువు వద్దకు చేరుకునే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెరువులోకి దూసుకుపోయింది. ఎవరూ గుర్తించకపోవడంతో అదేరోజు మధ్యాహ్నం ఓ గుర్తు తెలియని శవం నీటిపై తేలియాడుతోందని స్థానికులు మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారాన్ని అందించారు. దీంతో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న రూరల్ పోలీసులు స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని మెడలో ఉన్న గుర్తింపు కార్డు ఆధారంగా ఏపీ సచివాలయ పోస్ట్ మెన్ కేశవరావుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అనంతరం కేశవరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చినకాకాని ఎన్నారై ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు.

8వ వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి- మంగళగిరి: పట్టణంలోని 8వ వార్డులో బుధవారం ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి అనే కార్యక్రమం జరిగింది. టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం బడ్జెట్లో చేనేత అభివృద్ధికి కావాల్సిన నిధులను కేటాయించకుండా మోసం చేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే చేనేత జోళీ శాఖలను వేరుచేసి చేనేత రంగాన్ని అభివృద్ధి చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారన్నారు. టిడిపి ఉపాధ్యక్షుడు జి.దుర్గారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వి.మాధవరావు, 8వ వార్డు ప్రధాన కార్యదర్శి జె.మల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు టి.హనుమంతరావు, బి.సీతారామయ్యలు పాల్గొన్నారు.

దావా నోటీసు

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో, గుంటూరు

ఓ.యస్.నెం. 1405/2021

బిట్వీన్ :
బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్ష్మీపురం బ్రాంచి, గుంటూరు
.... వాది

మరియు
1) గవర్రాజు మోహనకృష్ణ
2) గవర్రాజు హిమవతి ... ప్రతివాదులు

టు
గవర్రాజు మోహనకృష్ణ, తండ్రి వెంకటా చలమరాజు
గవర్రాజు హిమవతి తండ్రి వెంకటా చలమరాజు
ఇద్దరి నివాసం : ప్లాటు నెం. ఎ5, వాసవి రెసిడెన్సీ, లక్ష్మీనగర్, 3వ లైను, చైతన్య కాలేజి ప్రక్కన, గోరంట్ల, గుంటూరు.

పై నెంబరు గల దావాలో ప్రతివాదులు అయిన మీపై వాది బ్యాంకువారు బాకీ వసూలు నిమిత్తం దావా దాఖలు చేసి, మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. ఇదిలా వుండగా శ్రీ కోర్టువారు దావా సమన్లు అమలు నిమిత్తం ది. 05-05-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. కనుక సదరు తేదీన ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలుపు కొనవలసినదిగా ఇందుమూలముగా తెలియ జేయడమైనది. అటుల కాని యెడల ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి తీర్మానం చేయుదురని యిందుమూలముగా తెలియజేయడమైనది

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది: ది.05-05-2023

ఇట్లు
గంగరాజు జగదీశ్ చంద్రబాబు
వాది తరపు న్యాయవాది, గుంటూరు.
సెల్ : 94904 50566

పంట నష్టం వివరాలను నమోదు చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

అకాల వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాల అధికారులతో ముఖ్యమంత్రి స్పెషల్ చీఫ్ సెక్రటరీ పూనమ్ మాలకొండయ్య టెలికాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. పల్నాడు జిల్లా నుంచి కలెక్టర్ ఎల్.శివశంకర్, జెసి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టం వాటిల్ల కుండా చూడాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేయాలని, వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఇతర ఉద్యాన పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించాలని సూచించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజలనూ అప్రమత్తం చేయాలని చెప్పారు. సివిల్ సప్లయీస్ అధికార్లు సైతం అవసరమైన రేషన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న కంపసాటి శివయ్య

గంగలకుంట సర్పంచిగా శివయ్య ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-వెల్దుర్తి

మండలంలోని వెల్దుర్తి మండలం సర్పంచ్‌గా కంపసాటి శివయ్య బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకూ సర్పంచ్‌గా వ్యవహరించిన కంపసాటి కాటంరాజు గత రాజీనామా చేయడంతో నూతన సర్పంచ్‌గా శివయ్య ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవగా నాయకులు సిహెచ్.శివ రామయ్య, బి.శ్రీనివాసరావు, పి.గురుబ్రహ్మం పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న సాయిమార్కొండారెడ్డి

రైతు భరోసా కేంద్రాలు సందర్శన

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని కండ్లకుంట, గుండ్లపాడు గ్రామాల రైతు భరోసా కేంద్రాలను పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.సాయిమార్కొండరెడ్డి, మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలన అనంతరం వారు మాట్లాడుతూ రైతులందరూ. భూసార పరీక్షలు చేయాలని, ఖరీఫ్ సీజనుకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ-క్రాప్, పిఎం కిసాన్ యోజనపై రైతులందరికీ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి చింత శివరామయ్య, వైఎస్ ఎంపిపి ఎ.సంజీవరెడ్డి, కండ్లకుంట, సర్పంచ్ వెంకట లక్ష్మారెడ్డి, గుండ్లపాడు సర్పంచ్ నారాయణ, ఎం.వెంకటరెడ్డి, ఏవో పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండలంలోని ఉప్పలపాడుకు చెందిన సింగాల ఏడుకొండలు, సింగాల వెంకటేశ్వర్లు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మట్టి ఖర్చుల నిమిత్తం మృతుల కుటుంబ సభ్యులు మల్లేశ్వరి, నారాయణమ్మకు రూ.10 వేలను మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, సెక్రటరీ చంద్రయ్య బుధవారం అందించారు.

ఎంత నిర్బంధించినా.. విశాఖ ఉక్కు కోసం పోరాటం

- సిపిఎం, సిపిఐటియు, ప్రజా సంఘాల నాయకుల ఉద్ఘాటన
- రాస్తారోకో చేస్తుండగా పలువురు అరెస్టు - స్టేషన్ వద్దా నిరసన

నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నిరసన తెలుపుతున్న ఎఐటియుసి నాయకులు

పోలీస్‌స్టేషన్ వద్ద నిరసర తెలుపుతున్న సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఇదే నినాదంతో ప్రజలను సమీకరించి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని, ఎన్ని నిర్బంధాలు, అక్రమ అరెస్టులు ఎదురైనా వెనక్కు తగ్గబోమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కార్మికులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా సిఐటియు, సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఆందోళనలు చేపట్టారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రాస్తారోకో నిర్వహించారు. స్థానిక ఎస్ఆర్‌కెటి కాలనీ వద్ద గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రాస్తారోకో చేశారు. ఆందోళన మొదలైన కొద్దిసేపటికే రూరల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. రాస్తారోకో చేస్తున్న వారిని బలవంతంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తీరును నిరసిస్తూ నాయకులు స్టేషన్ ఎదుటా ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడినా ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. అరెస్టయిన వారిలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, పట్టణ అధ్యక్షులు సిలార్ మసూద్, సిఐటియు రొంపిచర్ల మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరాజు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, నాయకులు మస్తాన్‌వలి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, కార్యదర్శి వై.రాధాకష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బత్తుల బాలకోటయ్య ఉన్నారు. వీరిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పోలీస్ స్టేషన్లో పరామర్శించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై మండిపడ్డారు. అనంతరం అరెస్ట్ అయిన నాయకులను 41 నోటీసులు ఇచ్చి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

ఇదిలా ఉండగా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఎఐటియుసి నాయకులు కోరారు. కాదని ప్రైవేటీకరిస్తే సహించేది లేదంటూ పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకొని నాయకులను 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎఐటియుసి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.రాధాకష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు పట్టణ కార్యదర్శి వి.వెంకట్ ఉన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వెంకటేశ్వర్లుకు నోటీసు ఇస్తున్న పోలీసు

ఉక్కు పరిరక్షణ ర్యాలీకి వెళ్లవద్దని సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లను పోలీసులు బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు పట్టణ పోలీసులు గృహనిర్బంధం చేశారు. తొలుత మంగళవారం రాత్రి 10 గంటలకు నోటీసులు ఇచ్చారు.

అప్పటి లేటు.. ఇప్పుడు పంటకు చేటు

- వానలకు నేలవారి నీట నానుతున్న వరికంకులు
- సాగు ఆలస్యం కావడం వల్లేనని రైతుల ఆవేదన

చల్లగుండ్ల - దేచవరం గ్రామాల మధ్య కంకిదశలో నేలవాలిన వరిపైరు

ప్రజాశక్తి - నకరికల్లు

ఖరీఫ్‌లో ప్రభుత్వం సాగునీటి విడుదలలో చేసిన జాప్యం రబీ పంటలను నీట ముంచుతోంది. ఖరీఫ్ ప్రారంభంలో సాగునీరు నెలవరకూ ఆలస్యంగా రావడంతో నాట్లు కూడా అంతే ఆలస్యమయ్యాయి. అది అంతే కొనసాగుతూ రబీలోనూ దాదాపు నెల ఆలస్యంగా సాగుకు దారితీసింది. దీంతో జనవరిలోనే పూర్తవ్వాల్సిన వరినాట్లు ఫిబ్రవరి చివరి వరకూ కొనసాగాయి. రబీలో మండలంలో 10500 ఎకరాలోల వరి సాగైంది. సాధారణంగా ప్రతిఏటా మండలంలో ఏప్రిల్ చివరివారంలోనే పంట ఇంటికి చేరుతుంది. అయితే ఈ ఏడాది కొంత పైరు కంకిదశలో ఉంది. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా వరుస వానలతో రైతుల కంటిమీద కనుకు కరువైంది. మండలంలోని చల్లగుండ్ల - దేచవరం గ్రామాల మధ్య కంకిదశలో ఉన్న వరిపైరు నేలవాలి నీట మునిగింది. కొన్ని కంకులు బురదలో కూరుకుపోవడంతో కోతకోసే పరిస్థితిలో లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టామని, ఇప్పటికే ధాన్యానికి ధర సరిగా లేకపోగా తాజా వానలతో పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తొలుత పొలాలను అధికారులు పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

అకాల వర్షాలకు మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ముంచుకొచ్చింది. పెదకూరపాడు మండలంలో 8500 ఎకరాల్లో మిరప సాగు చేశారు. అతివృష్టి, అనావృష్టి, చీడ పీడల నుండి పైరును కాపాడుకుంటూ వచ్చారు. పంట చివరి దశలో ఉన్న సమయంలో గత వారం నుంచి ఎడతెరపలేని వర్షాలు పడుతున్నాయి. దీంతో రైతులు కళ్లాలపై పట్టాలు కప్పినా పంటను కాపాడుకోవడం కష్టమవుతోంది. తడిసిన కాయలు ఏరటం మరోచోట పోసుకోవడం దినచర్యగా మారింది. ఎత్తుగాలితో కూడిన వర్షాలు కురుస్తుండటంతో పట్టాలు నిలవడం లేదు. దీంతో మిరపకాయలు పై మచ్చ, తాలు కావటం, కుళ్లిపోయే అవకాశం ఉంది. ప్రతిరోజు పట్టాలు వేయటానికి, తీయటానికి కనీసం ముగ్గురు మనుషులు అవసరం కాగా ఇది రైతులకు అదనపు భారమైంది. మరోవైపు ఇదే అదనుగా వ్యాపారులు నాణ్యత పేరుతో ధరను ఇప్పటికే తగ్గించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా మిర్చిని క్వింటాళ్ రూ.20 వేలకు కొనాలని రైతులు కోరుతున్నారు.

పెదకూరపాడు మండలంలో మిర్చిని ఆరబోసిన ప్రదేశంలో నీటి చెమ్మ

పంటను పరిశీస్తున్న పెండ్యాల మహేష్

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అకాల వర్షాల వల్ల కళ్లాల్లో తడిసిన మిర్చి, మొక్కజొన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల మండలంలోని కంకణాలపల్లిలో తడిసిన మిర్చి, మొక్కజొన్న పంటలను మహేష్ బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. అధిక పెట్టుబడులు పెట్టి చీడపీడల నుంచి రక్షించుకున్న పంటలు నేడు అకాల వర్షాలు వల్ల తడిసిపోయాని రైతులు వాపోయారు. మహేష్ మాట్లాడుతూ అకాల వర్షాలు వల్ల దెబ్బతిన్న పంటలకు అధికారులు సత్వరమే పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మేకల కోటి రాములు, పచ్చ అప్పారావు, వేలివెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్

విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉధృత ఉద్యమాలు

- జిల్లాలో రాస్తారోకోలు- ధర్నాలు
- నిరసనలపై తీవ్ర స్థాయిలో నిర్బంధం
- నాయకుల అరెస్టులు

ప్రజాశక్తి-గుంటూరు

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత 800 రోజులుగా జరుగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా వామపక్షాలు, ఇతర రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాల పిలుపు మేరకు గుంటూరులో తలపెట్టిన రాస్తారోకోపై పోలీసులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. ఎన్ని నిర్భంధాలు ప్రయోగించినా సిపియం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు, కార్మిక ప్రజా సంఘాల నాయకులు బుధవారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్‌కు చేరుకొని రాస్తారోకో నిర్వహించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో నాయకులు అక్కడే రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. పోలీసులు నాయకుల్ని బలవంతంగా వాహనాల్లో ఎక్కించి అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. సిపియం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పాశం రామారావు, జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శులు కె.నళినీకాంత్, మాల్యాద్రి, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజి, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి గనిరాజు, వివిధ ప్రజా సంఘాల నాయకుల్ని అరెస్ట్ చేసి అరండల్‌పేట స్టేషన్‌కు తరలించారు. కాగా పోలీసులు ముందురోజు నుండే పలువురు నాయకులకు ఇళ్లకు వెళ్లి రాస్తాకోకు వెళ్లవద్దని నోటీసులు జారీ చేశారు. గృహ నిర్భంధంలో ఉంచారు. సిఐటియు పశ్చిమ నగర ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావును మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌లో ఉంచారు. సిఐటియు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావును గృహ నిర్భంధంలో ఉంచారు. ఆందోళన సందర్భంగా పాశం రామారావు, జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేటీకరిస్తుంటే దాన్ని అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై నిర్భంధం ప్రయోగించటం సరికాదన్నారు. కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవటానికి ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. సిపియం నాయకులు బి.సత్యన్నారాయణ, నికల్సన్, బాషా, సిపిఐ నాయకులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు అరెస్ట్ అయ్యారు.

గుంటూరు శంకర్‌విలాస్ సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సిపిఎం, సిపిఐ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

గుంటూరులో అరెస్టులు

ప్రజాశక్తి - మంగళగిరి

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేటికరించడానికి వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ, టిడిపి, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది. తొలుత ఆయా పార్టీల కార్యాలయం నుండి ప్రదర్శనగా అంబేద్కర్ సెంటర్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నా కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చేంగాయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం హనుమంతరావు, సిపిఐ నియోజకవర్ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, టిడిపి నాయకులు వాదం మాధవరావు మాట్లాడారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకోవడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పి బాలకృష్ణ, పట్టణ నాయకులు ఎస్ గణేష్, బి స్వామినాథ్, టి హేమ సుందర్ రావ్, సిపిఐ నాయకులు వై వెంకటేశ్వరరావు, జాలాది జాన్ బాబు, ఏ ప్రభాకర్, పి నాగేశ్వరరావు, చిన్ని సత్యనారాయణ, టిడిపి నాయకులు గోవాడ దుర్గారావు, సింహాద్రి రామారావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, ఏ నాగబాబు పాల్గొన్నారు.

సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ఆపే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

మంగళగిరిలో నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ, టిడిపి, కార్మికసంఘాల నాయకులు

పెదకాకానిలో

తెనాలిలో కాంగ్రెస్‌పార్టీ నిరసన

దుగ్గిరాలలో

ప్రజాశక్తి-తెనాలి

విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ పిలుపు మేరకు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజాసంఘాల, వామపక్షాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. తొలుత బోస్‌రోడ్డుకు చేరుకున్న ఆందోళన కారులను పోలీసలు అడ్డుకోవటం తో, వారు తిరిగి స్థానిక బోస్‌రోడ్డు లోపి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. నిరసనలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు పి.నాగసూర్యశశి ధరరావు, సిపిఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, టిడిపి నాయకులు మహ్మద్ ఖుద్దూస్, జనసేన నాయకులు బి.రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఫిరంగిపురం : పొనుగుపాడు గ్రామంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమ ంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌ఎం వలి, రైతు సంఘం నాయకులు జివి రావు ప్రసంగించారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

విశాఖఉక్కు ఉద్యమానికి మద్దతుగా పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో పట్టణ కార్యదర్శి జంపని గోవిందరాజు, నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు, ఆటో యూనియన్ నాయకులు మిక్కిలిబాబు ప్రసంగించారు.

ప్రజాశక్తి - పెదకాకాని

విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతుగు పెదకాకానిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సిపిఐ నాయకులు కేతినేని అగస్టిన్ అధ్యక్షతన సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పెదకాకాని మండల సిపిఎం కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసులు రాస్తారోకోను అడ్డుకుని ఆందోళనాకారులను లాగివేశారు. కార్యక్రమంలో నాయకులు రెంటాల కుమారి. రామిశెట్టి శ్రీనివాసరావు, నారా ప్రసాదు, సిహెచ్ విజయలక్ష్మి, బుల్ల సురేష్, బుల్ల వీరయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రజాశక్తి దుగ్గిరాల

రాజకీయాలకు అతీతంగా పార్టీలన్నీ కలిసి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని రక్షించుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ కోరారు. స్థానిక రైలుపేటలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద విశాఖ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు వల్లభనేని సాంబశివరావు, జెట్టిబాలరాజు, ఎం నాగమల్లేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాడులో

పొన్నూరులో

ముందస్తు నోటీసులు అరెస్టులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి ని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్ర ఆందోళనలో భాగంగా వివిధ పార్టీలు ఆందోళన బాట పట్టగా ఈ క్రమం లో ఆయన్ను అరెస్టు చేశారు. తొలుత నోటీసు ఇచ్చి ఆ తరువాత మరల అరెస్ట్ చేశారు. సాయంత్రం విడుదల చేశారు.

పోలీస్ స్టేషన్‌లో ఎం రవి

తాడేపల్లిలో యథావిధిగా రాస్తారోకో

ప్రజాశక్తి-తాడేపల్లి :విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని డిమాండ్ చేస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో తాడేపల్లి తహశీల్దార్ కార్యాలయం దగ్గర రాస్తారోకో చేసి తమ నిరసన తెలియజేయాలని వామపక్షల పార్టీలు, ట్రేడ్ యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. అందులో భాగంగా తాడేపల్లి పోలీసులు బుధవారం తెల్లవారుజామునే సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు తాడేపల్లి పట్టణ కర్యాదర్శి వేముల దుర్గారావు, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్యలను ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో అదుపులోకి తీసుకున్నారు. రాస్తారోకో చేయడానికి అనుమతులు లేవని హెచ్చరించారు. అయినా అనుకున్న సమయానికి సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) నాయకులు తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు అడ్డుకుని అందరినీ రోడ్డు పక్కకు తరలించారు. అక్కడే తమ నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి మాట్లాడుతూ లక్షల కోట్ల రూపాయల విలువైన విశాఖ ఉక్కును కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి ప్రజలు పెద్దఎత్తున ముందుకు రావాలని కోరారు. సిపిఐ నాయకులు ఎం.సుహాస్ మాట్లాడుతూ మోడీని గద్దె దించడం ద్వారానే ఈ దేశానికి రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు కొట్టె కరుణాకరరావు, గాదె సుబ్బారెడ్డి, సోలా ముత్యాలరావు, వై.బర్నబస్, ఎ.శౌరిబర్తు లం, ఎ.శాస్త్రి, కె.మేరి, తులసమ్మ, కె.ప్రభాకరరావు, వెంకన్న, బి.ప్రభాకరరావు, టి.వెంకటయ్య, ఎం.రామారావు, ఎం.చెన్నయ్య, ఎఐఎఫ్‌టియు నాయకులు కె.ఆదినారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిలో

తుళ్లూరులో అరెస్టులు

ప్రజాశక్తి - తుళ్లూరు :రాజధాని గ్రామం తుళ్లూరులో సిఐటియు, ఎఐటియుసి నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో తుళ్లూరులో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు, పేరం బాబూరావు,షేక్ జానీ, ఎఐటియుసి నాయకులు షేక్ నాగుల్ మీరా, సిపిఐ తాడికొండ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, కంభంపాటి దేవునిదయ రాస్తారోకో చేపట్టారు.సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని భాగ్య రాజు,శివ శంకరరావుతో పాటు మిగిలిన వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

సమీక్షలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్

పథకాలు, అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

అభివృద్ధి పనులు, పథకాలను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలను నుండి బుధవారం సమీక్షించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరుపై ఆరా తీశారు. రీ సర్వే పనులు, భూములకు హద్దురాళ్ళు వేయడం, స్పందన సమస్యల పరిష్కారం, మ్యుటేషన్స్ సర్వీసులు, భూ సేకరణ కార్యక్రమం, ఎన్నికలకు సంబంధించి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం, మార్పులు, చేర్పులు, ఓటర్ కార్డు బదిలీలు, అటవీ శాఖ భూములు గుర్తింపు, లబ్ధి దారులు చేసుకున్న దరఖాస్తులు, భూ పంపిణీకి తీసుకున్న చర్యలు, వృద్ధుల చట్టం అమలు తీరు తదితర అంశాలపై మాట్లాడి వివరాలడిగారు. పనుల పురోగతి నివేదికలను కలెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వసంత్‌బాబు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సత్కారం పొందుతున్న దార్ల బుచ్చిబాబు

దార్ల బుచ్చిబాబుకు ప్రెస్‌క్లబ్ సత్కారం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన బాలల సాహిత్య రచయిత, సీనియర్ పాత్రికేయులు దార్ల బుచ్చిబాబును ప్రెస్‌క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎ.అశోక్ కుమార్, జనరల్ సెక్రటరీ షేక్ దరియావలి, విలేకర్లు పాల్గొన్నారు.

'అధికార పార్టీ అండతోనే నకిలీ విత్తన వ్యాపారం'

ప్రజాశక్తి - విజయపురిసౌత్

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి ఎస్టీ విభాగం నాయకులు ఎం.దారునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విజయపురిసౌత్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. సిఎంగా చంద్రబాబు చేసిన అభివృద్ధిని చెప్పిన సినీహీరో రజినికాంత్ మాటలను తీవ్రంగా విమర్శిస్తున్న వైసిపి నాయకులు రైతుల సమస్యలపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో అధికార పార్టీ అండతోనే నకిలీ విత్తనాల వ్యాపారం జోరుగా సాగుతోందని, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అక్రమ మార్గాల్లో రూ.కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి తరుపున జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుస్తారనే భయంతోనే ఆయన కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని అన్నారు. సమావేశంలో ఎన్.వీరాస్వామి యాదవ్, జి.శ్రీనివాస్ యాదవ్, బి.వెంకటేశ్వర్లు చౌదరి, ఎ.కోటయ్య, స్వామి నాయక్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో అవినీతి చీకట్లు

- ఏడాది నుండి మంజూరు చేయని స్త్రీ నిధి రుణాలు
- ఆన్‌లైన్‌లో రూ.ఐదు కోట్లకు పైగా ఎన్‌పిఎ చూపుతున్న బకాయిలు
- ఆడిట్ కోసం ఒక్కో గ్రూపు నుండి రూ.500 వసూలు

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల సమైక్య కార్యాలయంలో అవినీతి చీకట్లు అలుముకున్నాయి ఏడాదికాలంగా స్త్రీనిధి రుణాలు మండలానికి ఒక రూపాయి కూడా కేటాయించలేదు (పిఒపి - పూర్ ఆఫ్ ది పూర్) ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 2018-2019 ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లను డ్వాక్రా సంఘాల్లో ఎస్సీ, ఎస్టీలకు వడ్డీ లేని రుణాలుగా మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీల జీవనోపాధి మెరుగు కోసం వీటిని ప్రభుత్వమే ఇస్తుంటుంది. నాలుగేళ్లయినా అవి రికవరీ కాలేదు. సాధారణంగా డ్వాక్రా సభ్యులు రుణాలు తీసుకుంటే ప్రతినెలా వాటి వాయిదాలు చెల్లిస్తుంటారు. అయితే ఇప్పటికీ వాటిని చెల్లించనట్లు బకాయిలుగా రికార్డుల్లో ఉండడంతో అసలు అవి అసలైన లబ్ధిదార్లకే దకాయా? లేదా సిబ్బంది స్వాహా చేశారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్వచ్ఛభారత్ పేరుతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కింద వెలుగు కార్యాలయం నుండి రూ.40 లక్షల రుణాలు మంజూరు కాగా వాటి బకాయిలు కూడా ఆన్‌లైన్‌లో చూపిస్తున్నాయి. చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాల పేరుతో సిఐఎఫ్ కింద మండలానికి రూ.69 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయగా ఇవి కూడా ఆన్‌లైన్‌లో డ్వాక్రా సంఘాల పేరుతో చూపిస్తున్నారు.

డ్వాక్రా సంఘాల మనుగడకు వివో, స్త్రీ నిధి సభ్యత్వం పేరుతో రూ.2700 ఒక గ్రూపు నుండి వసూలు చేస్తారు. ప్రభుత్వం వివిధ రణాలకు వచ్చే వడ్డీ మొత్తం కూడా మండల సమైక్య ఖాతాలో జమవుతుంది. ఈ నగదును సంఘాలలోని లబ్ధిదారులకు అత్యవసర కాలంలో సహాయంగా ఇచ్చి వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పుడు తిరిగి జమ చేయించాలి. కానీ ఈ ఖాతాలో రూ.లక్ష మాత్రమే నిల్వ చూపిస్తున్నారు. సిఐఎఫ్ పేరుతో రూ.69 లక్షలు, స్త్రీ నిధి బకాయిలు రూ.రెండు కోట్లు, పిఒపి సబ్‌ప్లాన్ రూ.రెండు కోట్లు, మరుగుదొడ్ల తాలూకు రూ.20 లక్షలు, మొత్తంగా ఐదు కోట్ల వరకు ఎన్‌పిఎ (నిరర్థక ఆస్తి) అంటూ ఆన్‌లైన్‌లో బకాయిలు చూపిస్తున్నారు. గతంలో పనిచేసిన సిసిలు అవినీతి పాల్పడ్డారంటూ కొందరు, విఎఒ బినామీ పేర్లతో అవినీతి చేశారంటూ ఒకరిపై ఒకరు చెబుతున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా అధికారులు పట్టించుకోపోవడం వారి భాగస్వామ్యం పైనా అనుమానాలు తలెత్తుతున్నాయి.

కొద్దిరోజులుగా మండలంలో డ్వాక్రా సంఘాలకు ఎస్‌హెచ్‌జి ఆడిట్ సీఆర్పీలు నిర్వహిస్తున్నారు. ఇందుకుగాను ఒక్కొక్క గ్రూపు నుండి రూ.500 వసూలు చేస్తున్నారు. మండలంలో1440 గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపు రూ.500 చెల్లించగా సుమారు రూ.7 లక్షల వరకు వసూలవుతాయి. దీనిపైనా సభ్యులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఒక్కరైనా పట్టించుకున్నారా?

- మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు
- రెండు గ్రామాల్లో పంటల పరిశీలన

మిర్చి పంటను పరిశీలిస్తున్న పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండలంలోని గంగన్నపాలెం, నాదెండ్ల మండలంలోని ఇర్లపాడు గ్రామాల్లో మిర్చి మొక్కజొన్న, మిర్చి పొలాలను మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు బుధవారం పరిశీలించారు. అనంతరం పట్టణంలోని తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులను అకాల వర్షాలు పూర్తిగా నష్టపరిచాయని, అయినా స్థానిక ప్రజాప్రతినిధులు వారిని పరామర్శించలేదని, ప్రభుత్వం ఇంత వరకు స్పందించలేదని విమర్శించారు. గత రెండేళ్ళుగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారమే ఇవ్వలేదని అన్నారు. మిర్చి దిగుబడులు బాగా తగ్గాయని, ఎకరాకు 20 క్వింటాళ్లు రావాల్సింది 10-15 క్వింటాళ్లే వస్తోందని, క్వింటాళ్ రూ.20 వేలు ఉండాల్సిన ధర రూ.8 వేలకు మించడం లేదని చెప్పారు. దీనివల్ల రైతులకు కోత కూలి ఖర్చులు కూడా రావడం లేదన్నారు. మొక్కజొన్న పంట కూడా తడిసిందని ధర రూ.2200 ఉండాల్సి ఉన్నా రూ.1500కే అమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతులున్నారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఒక్క క్వింటాళ్లయినా మొక్కజొన్న కొన్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలనలో నాయకులు ఎం.వీరారెడ్డి, ఎన్.సదాశివరావు, బి.సత్యనారాయణ, జె.మదన్ మోహన్, జి.నాగపూర్ణచంద్రరావు, ఆర్.నాగేశ్వరరావు, పి.హనుమంతరావు పాల్గొన్నారు.

6న రొంపిచర్ల మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 6వ తేదీ ఉదయం 10 గంట లకు నిర్వహిస్తామని ఎంపిడిఒ కె.మ్యాథ్యూబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలు, ఇతర అంశాలపై చర్చించాల్సిన ఉన్నందున సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

పింఛను నిలిపేశారని ఆందోళన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సచివాలయం ఎదుట బైటాయించిన బాధితుడు, టిడిపి నాయకులు

డప్పు కళాకారుణ్ణయిన తనకు ఐదేళ్ళుగా వస్తున్న పింఛనును రెండు నెలల కిందటి నుండి నిలిపేశారని మండలంలోని కొమెరపూడికి చెందిన సంకటి వీరరాఘవులు గ్రామ సచివాలయం ఎదుట తన బంధువులు, టిడిపి నాయకులతో కలిసి బుధవారం బైటాయించారు. తన కుమారుడు ఇటీవల టిడిపిలో చేరిన కారణంగా రాజకీయ కక్షతోనే పింఛను నిలిపేశారని ఆరోపించారు. తన పింఛను నిలిపివేతపై సమాధానం చెప్పాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును డిమాండ్ చేశారు. వీర రాఘవులు డప్పు కళాకారుడు కాదని, విచారించాలని గ్రామానికి చెందిన సంకటి శ్యాంసన్ ఫిర్యాదుతో నిలిపేసినట్లు కార్యదర్శి చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సచివాలయం చేరుకుని వారితో చర్చించి ఆందోళన విరమింపజేశారు. రెండ్రోజుల్లో పింఛనివ్వకుంటే మళ్లీ ఆందోళన చేస్తానని ఆయన చెప్పారు. ఆందోళనకు టిడిపి నాయకులు మన్నెం శివనాగమల్లేశరరావు, యర్రా వెంకటేశ్వరరావు, ఎ.బాబు మద్దతు తెలిపారు.

సచివాలయంలో తనిఖీలు చేస్తున్న కమిషనర్ షమీ

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు
ఇద్దరికి మెమోలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

వార్డు సచివాలయాల్లో అందిస్తున్న పౌర సేవలకు అధికంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సచివాలయ సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ కె.షమీ హెచ్చరించారు. పట్టణంలోని 1, 4 వ సచివాలయాలను కమిషనర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బయోమెట్రిక్ వేసి, మూమెంట్ రిజిష్టర్లో ఏ పని మీద బయటికి వెళ్లారో నమోదు చేయని కారణంగా 4వ సచివాలయంలోని ఇద్దరికి మెమోలు జారీచేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేషన్ త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యలపై వాలంటీర్, సెక్రటరీ, సంబంధిత అడ్మిన్ వెళ్లి సమస్యను సత్వరమే పరిష్కరించాలని, పరిష్కారం కాకుండా వాటిని క్లోజ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతింజూ మధ్యాహ్నం 3-5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. సమయ పాలన పాటించాలని, సచివాలయంలో అందే సేవలకు ప్రజల కోసం ధరల పట్టిక అందుబాటులో ఉంచాలని చెప్పారు.

ఆరుగురు వికలాంగులకు వాహనాలు పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల : వైసిపి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని, పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వికలాంగులకు నూరుశాతం సబ్సిడీతో అందిస్తున్న మూడు చక్రాల వాహనాలను స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఆరుగురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానిత ప్రాంతాల్లో నిఘా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-తెనాలి

'తెనాలిలో జోరుగా నంబరింగ్ లాటరీ' అన్న శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. తెనాలిలో నిత్యం పట్టుపడుతున్న పేకాట, గంజాయి విక్రయాలు, నంబరింగ్ లాటరీపై కథనంలో ప్రస్తావించటంతో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎన్ అన్నపూర్ణ స్పందిచారు. కథనంపై వివరణ ఇచ్చారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆవిర్భావం నుంచి పేకాట, గంజాయిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలపై నిషేదాన్ని తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే నంబరింగ్ లాటరీపై అనుమానిత ప్రాంతాల్లో నిఘా పెట్టి కేసులు నమోదు చేయాల్సిందిగా సబ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌ను అదేశించినట్లు తెలిపారు. గంజాయి, నిషేదిత మత్తుపదార్థాల విక్రయం, ఇసుక అక్రమ రవాణా, పేకాట, లాటరీ వంటి కార్యకాలాపాలపై 14500 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

అపరాలసాగుపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చేబ్రోలు

వేజెండ్లలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం వరి అనంతరం అపరాలసాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అపరాల సాగు వలన భూమికి బలం చేకూరుతుందని, వరిలో తెగుళ్ళు, పురుగులు తక్కువగా ఉంటాయని జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు అన్నారు.ఈ కార్యక్రమానికి పొన్నూరు వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.తిరుమల దేవి, మండల వ్యవసాయ అధికారి బి. శ్రీనివాస్ నాయక్ పాల్గొని ఆపరాల సాగు భూమి ఆరోగ్యం గురించి సూచనలు చేశారు.అలాగే మొక్కజొన్న తడిచిన గింజలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వివిఎ జాన్, సూర్య ప్రకాష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

5న బుద్ధపూర్ణిమ వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

బుద్ధ పూర్ణిమ వేడుకలను స్థానిక విటిజెఎ., ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలోని మురుగుడు హనుమంతరావు కళాప్రాంగణంలో 5వ తేది శుక్రవారం సాయంత్రం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహణ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ప్రజాకవి జయరాజ్ హాజరవుతుండగా, వక్తలుగా బుద్ధా ఫౌండేషన్ సంస్థాపకుడు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, మైండ్ ఫిట్ నెస్ టీచర్ కట్టా కళాధర్ రెడ్డి, మంగళగిరి బుద్ధవిహార్ కార్యదర్శి పామర్తి రవి, జిల్లా పిరమిడ్ సేవాదళ్ కార్యదర్శి ఆకురాతి శంకరరావు పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు కంచర్ల కాశయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో బౌద్ధధర్మం విశిష్టతపై మంగళగిరి బుద్ధవిహార్ సంస్థాపకుడు రేకా కృష్ణార్జునరావు ప్రసంగిస్తారు. కార్యక్రమంలో, సాహితీ ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

మంగళగిరి పీఏసీఎస్ డైరెక్టర్ సుబ్బారావుకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి: ది మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ కార్యాలయంలో బుధవారం నూతన పీఏసీఎస్ డైరెక్టర్‌గా చినకాకానికి చెందిన సుంకర సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్ సుబ్బారావుచే సొసైటీ కార్యదర్శి రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. గత నెల 24 న జరిగిన సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకా రోత్సవంలో అనివార్య కారణాలవల్ల సుబ్బారావు డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేయకపోవడం వల్ల బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు.సుబ్బారావును సొసైటీ చైర్మన్ ఆర్ల బ్రహ్మయ్య, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్. రఘుపతిరావు, వైసిపి నాయకులు ఎల్.రమేష్ శాలువాతో సత్కరించి అభినందించారు.

అస్వస్థతకు గురౌవుతున్న పారిశుధ్య కార్మికులు

తుళ్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - తుళ్లూరు: రాజధాని గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికుల అస్వస్థకు గురౌవుతున్నారని, తక్షణమే వారికి రక్షణ పరికరాలు ఇవ్వాలని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి డిమాండ్ చేశారు. బుధవారం తుళ్లూరులో విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ చెత్తడంప్ లో ప్లాస్టిక్,మద్యం డబ్బాల కోసం సిఆర్‌డిఎ అధికారులు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. బుధవారం తుళ్లూరు చెత్తడంప్‌లో ప్లాస్టిక్ వస్తువులు వేరు చేస్తూ నీరుకొండ నుంచి తుళ్లూరు వచ్చి విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికురాలు నల్లగొండ కోటేశ్వరి,ఎస్ రమాదేవి, తుళ్లూరుకు చెందిన వీర్లంకమ్మ దుర్వాసన కారణంగా వాంతులతో సొమ్మసిల్లి పడిపోయారని తోటి కార్మికులు వారిని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చడం జరిగిందని చెప్పారు. మంగళ,బుధ వారాల్లో ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారని అన్నారు. ముక్కుపుటా లదిరేలా దుర్వాసన వస్తున్నా,కనీసం రక్షణ పరికరాలు కూడా లేకుండా గత్యంతరం లేని పరిస్థితుల్లో కార్మికులు విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళల్లోని వ్యర్థాలు,చచ్చిన జంతు కళేబరాలను సైతం బళ్లలో తీసుకెళ్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ కార్మికులు రోగాలు తెచ్చుకుంటున్నారని అన్నారు. అధికారులు మాస్కులు కూడా ఇవ్వకుండా చేస్తే చెయ్యండి..లేదంటే పని మానేయండి..అన్న విధంగా వ్యవహరించడం దారుణమన్నారు.గ్రామాల్లో పారిశుధ్యంకు ప్రాధాన్యత ఇవ్వకుండా, కార్మికులను డంప్‌లకు తరలించి చెత్తలో వస్తున్న ప్లాస్టిక్ వస్తువులను నిల్వచేసి అమ్మి సొమ్ము చేసు కుంటున్నారని అన్నారు. తమ గ్రామాల్లోని కార్మికులను ఇతర గ్రామాలకు పంపిస్తుండటంతో గ్రామాల్లో కార్మికులు తగ్గి, పారిశుధ్యం అధ్వాన్నంగా మారుతున్నా గ్రామాల్లోని పెద్దలు స్పందించక పోవడం మంచిది కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు మొండివైఖరి వీడాలని, కార్మికుల ప్రాణాలతో చెలగాట మాడటం మానుకోవాలన్నారు.ఏ గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ఆ గ్రామాల్లోనే ఉంచి పనిచేయించాలని డిమాండ్ చేశారు.కార్మికులకు ఇవ్వాల్సిన రెండు నెలల పెండింగ్ జీతం వెంటనే చెల్లించాలని కోరారు.

ఉపాధి హామీ పనులు తనిఖీ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఉపాధి హామీ పనులను జిల్లా ఎపిడి అండ్ ఎంఎన్ డి పావులూరి బాలమ్మ బుధవారం తనిఖీ చేశారు.పెదపరిమిలో క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను,హరిశంద్ర పురంలో చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు.అనంతరం తుళ్లూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పై అవగాహన కల్పించడం ద్వారా కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు.పెదపరిమిలో ఉపాధి పనుల్లో 159 మంది కూలీలు ఉన్నారని, 500 మందికి పని కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. హరిశంద్రపురంలో కూలీల సంఖ్యను 250కు పెంచేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కూలీలు దినసరి వేతనం రూ .272 లు పొందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

మానవ హక్కులకు పత్రికాస్వేచ్ఛ చోదకశక్తి

మాట్లాడుతున్న ప్రసాదరావు

ప్రజాశక్తి-గుంటూరు

మానవ హక్కులకు పత్రికా స్వేచ్ఛ చోదకశక్తి అని, దాన్ని మరింత బలోపేతం చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం విజయ వంతమౌతుందని వక్తలు అన్నారు. బుధవారం అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రపంచ పత్రికా దినోత్సవం కార్యక్రమంలో న్యాయవాది, విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజంలో నేడు అసమానతలు, హింస, సంఘర్షణలు పెచ్చుమీరుతున్నాయని, బెదిరింపు ధోరణలు ప్రబలుతున్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా భావవ్యక్తీకరణ, మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని చెప్పారు. కోవిడ్ విజృంభించినప్పుడు ప్రసార మాధ్యమాలు బాధ్యతాయుతమైన పాత్ర పోషించాయని చెప్పారు. ఎపి లాయర్స్ ఫోరం కన్వీనర్ ఎ.హరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రసార మాధ్యమాల నోళ్ళు మూయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పత్రికా స్వేచ్ఛ ర్యాంకింగ్‌లో భారత దేశం 150వ స్థానమంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య, వెంకటరత్నం, మురళీకృష్ణ, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఎఎన్‌యులో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి -ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే, కాలేజ్ డేల ఉత్సవాలు నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బెంగళూరు ఇస్రోలోని కెపాసిటీ బిల్డింగ్ అండ్ పబ్లిక్ ఔట్ రీచ్ డైరెక్టర్ ఎన్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యా ప్రమాణాలను నిత్యజీవితంలో సమాజ శ్రేయస్సుకై ఉపయోగపడే నూతన ఆవిష్కరణల కోసం విద్యార్థులు వినియోగించాలని తెలిపారు. ముఖ్య అతిధి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పి రాజశేఖర్ మాట్లాడుతూ విద్య అనేది ప్రతి మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఫిలిం మ్యూజిక్ డైరెక్టర్ శ్రీ యశ్వంత్ నాగ్ మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం ఉత్సాహంగా ఉంటూ అన్ని కళలలోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ, విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి వరప్రసాద్ మూర్తి ఇంజనీరింగ్ పట్టా తీసుకుంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి సిద్దయ్య అధ్యక్షత వహించారు. గౌరవ అతిథులుగా ఆచార్య ఈ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ జి ప్రతిభ, డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వర్శిటీ ఉపకూలపతి పి. రాజశేఖర్

శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గాయకుడు శ్రీనివాస్‌కు ఎన్‌టిఆర్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శకపురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్లో బుధవారం ఎన్‌టిఆర్ నటించిన ఛాలెంజ్ రాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారులను సత్కరించే కార్యక్రమంలో భాగంగా కళాకారుడు, గాయకుడు నల్లూరి శ్రీనివాస్‌ను పార్టీ నాయకులు కెవి సుబ్రహ్మణ్యం, కాళహస్తి రఘు, తుల్లిమిల్లి మరియదాసు, పరుచూరి సుబ్బారావు, వినుకొండ శ్రీరామ మూర్తి, మేకా శివశంకర్, సాంబశివరావు తదితరులు ఎన్టీర్ జ్ఞాపికను అందజేసి సత్కరించారు. థియేటర్ కమిటి సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డి భవాని, ఎస్ సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జగన్, ఎం రాఘవరావు, గుమ్మడి ప్రసాద్, దాసరి నరసయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్‌యు విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి -ఎఎన్‌యు

గత నెలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో "ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీస్ లిమిటెడ్"వారు నిర్వహించిన ఇంటర్వ్యూలలో విశ్వవిద్యాలయానికి చెందిన 15 మంది విద్యార్థులు అసిస్టెంట్ లెక్చరర్లుగా ఏడాదికి రూ .7.5 లక్షల వేతనంతో ఉద్యోగ అవకాశాన్ని పొందారని ఉపకుతపతి ఆచార్యపి. రాజేశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. జువాలజీ విభాగం నుంచి 8 మంది, బోటనీ నుండి ఐదుగురు, కెమిస్ట్రీ విభాగం నుండి ఇద్దరు విద్యార్థులు తమ సత్తా చాటారని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలను సమన్వయం చేసిన ఆచార్య కె.సునీతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య కె.మధుబాబు, మహమ్మద్ తప్సీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశుభ్రత అంశాలపై అవగాహన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

కొత్తపేట తాలూకా పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎం లక్ష్మీనారాయణ అధ్వర్యంలో మండలం పరిధి అర్బన్, రూరల్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలకు వేసవి సెలవుల్లో పాఠశాల పరిశుభ్రత నిర్వహణ అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాలలకు ఆయాలు ప్రతిరోజు ఉదయం తప్పక హాజరవ్వాలని, పాఠశాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. నాడు నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో నైట్ వాచ్ మెన్‌లను కూడా నియమించడం జరిగిందని, పాఠశాలలు పరిశుభ్రత, భద్రత అంశాలను ధృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలన్నారు. వేసవి సెలవుల్లో మే, జూన్‌లకు సంబంధించి టిఎంఎఫ్ ఆయాలకు నెలకు రూ.3వేలు చొప్పున రూ.6 వేలు జీతం ఇవ్వబడుతందన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఏపి రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి-పెదకాకాని

మండలంలోని నంబూరు గ్రామ వైసీపీ నాయకులు జొన్నల అవినాష్‌రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిసేసింది. ఈ మేరకు బుధవారం పలువురు నాయకులు ఆయన అభినందనలు తెలిపారు.

జె. అవినాష్ రెడ్డి

కృషి, పట్టుదలతో సివిల్స్ సాధించవచ్చు

ఎస్ఎస్ఎన్ కళాశాల సదస్సులో పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్

ప్రజాశక్తి - నరసరావుపేట

కృషి, పట్టుదల, ఏదైనా సాధించగలం అనే నమ్మకం ఉంటే విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. స్థానిక పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కలశాల ఆడిటోరియంలో బుధ వారం ప్రభుత్వ ఉద్యోగం సాధించడం ఎలా అనే అంశాలపై స్థానిక శ్రీ హరిణి ఐఎఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ముఖ్య అతిధిగా జిల్లా కలెక్టర్ సివిల్స్ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. దేశ పరిస్థితులు, ప్రజా సమస్యలపై సివిల్స్ అభ్యర్థులు ప్రధానంగా అవగాహన పెంచుకోవాలన్నారు. సైన్స్ సబ్జెక్టు స్వభావ రీత్యా వాస్తవాలను ప్రతిబింబంప చేస్తోందని, సివిల్స్ సాధన మొదలు పెట్టాక సిలబస్‌లో సారాంశాన్ని గ్రహించడానికి నైపుణ్యాలను పెంపొందించుకోడానికి ప్రయత్నం చేయాలన్నారు. సాధారణ పాఠకుల కోసం ప్రచురితమయ్యే అనేక మ్యాగజైన్ పుస్తకాలను చదివి పఠనాశక్తిని పెంపొందించు కోవాలని సూచించారు. సివిల్స్ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఢిల్లీ స్థాయి ఫ్యాకల్టీలచే నరసరావుపేటలో సివిల్స్ అకాడమీ నడుపుతున్న డైరెక్టర్ కంచర్ల నరేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ హరిణి ఐఎఎస్, మరియు డిఎస్సి అకాడమీ గతంలో సాధించిన విజయాలను డైరెక్టర్ కంచర్ల నరేంద్ర జిల్లా కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్తులో పల్నాడు జిల్లా నుంచి ఐఎఎస్‌కి ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. సివిల్స్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు జిల్లా కలెక్టర్ తన జీవిత అనుభవాలను సివిల్స్ సాధించిన తీరును విద్యార్థులతో పంచుకున్నారు. సివిల్స్ విద్యార్థులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఇండియన్ ఎకానమీ ఫ్యాకల్టీ యోగేంద్ర శర్మ మాట్లాడుతూ సెమినార్‌లో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కోట సాంబశివరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

11లోగా పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాలి

ఖజానా శాఖ డిడి రాజగోపాల్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ట్రెజరీ ఉప సంచాలకులు బి.రాజగోపాల్‌ను ట్రెజరీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, సమస్యల పరిష్కారానికి సహకారం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా డిడి మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ ఈ.కే.వై.సి ని ఈనెల 11తేదీ లోపు చేయాలని, దానికి ఖజానా శాఖ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పెన్షనర్లు తమ మొబైల్ ఫోన్‌తో సహా ట్రెజరీ కార్యాలయానికి వస్తే వారికి ఈ.కే.వై.సి చేస్తారని తెలిపారు. దీని వలన పెన్షనర్లకు పూర్తి భద్రత, ఎప్పటికప్పుడు సమాచారం పెన్షనర్లకు ఫోన్ మెసేజ్ ద్వారా తెలిసే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఇప్పటి వరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని వారు ఈ నెల 15వ తేదీలోగా సమర్పించాలని, లేని ఎడల ఈనెల పెన్షన్ నిలిచే అవకాశం ఉందని చెప్పారు. కావున పెన్షనర్లు కొందరు నవంబర్, డిసెంబర్ నెలలో సమర్పించినట్లయితే అవి చెల్లుబాటు కావు అని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని, తర్వాత మాన్యువల్‌గా ట్రెజరీలో అందచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి. నాగరాజు, ఇన్‌ఛార్జి అధ్యక్షుడు జి.సైదులు, ఉపాధ్యక్షులు పి. రమేష్, యస్.ధనుంజయ, సంయుక్త కార్యదర్శి కె. మురళీ పాల్గొన్నారు.

డిడిని సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

10, 11 తేదీల్లో ఇంపాక్ట్ మెగా ఈవెంట్

ప్రజాశక్తి-గుంటూరు

వ్యక్తిత్వ వికాసం, సామాన్యుల జీవితాలను మార్చే దిశగా నగరంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంపా నాగేశ్వరరావు నేతృత్వంలో ఈనెల 10, 11 తేదీల్లో గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్లు మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ ఎం.మోహన్ తెలియజేశారు. బుధవారం మెగా ఈవెంట్ పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ మెగా ఈవెంట్‌లో సుమారు 2వేల మంది విద్యార్థులు, నిరుద్యోగులు, వ్యాపార వేత్తలు పాల్గొంటారని తెలిపారు. ప్రముఖ వ్యాపార వేత్తలు, విద్యావేత్తలు, సివిల్ సర్వీసు అధికారులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో అడిషనల్ ఎస్పీ సుప్రజ, ఇంపాక్ట్ గుంటూరు ఇన్‌ఛార్జి చల్లా రవి, డాక్టర్ యద్దనపూడి అరుద్ర పాల్గొన్నారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 94944 66389 నంబర్‌లోగానీ, http//gampa.in/events వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ తదితరులు

పంట నష్టం తగ్గించేలా చర్యలు : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో అకాలవర్షాలకు పంటలు దెబ్బతినకుండా వ్యవసాయ శాఖాధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలతో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టాన్ని సాధ్యమైనంత వరకూ తగ్గించేలా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తీసుకోవలసిన చర్యలు, అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న అకాలవర్షాల వల్ల దుగ్గిరాల, కొల్లిపర మండలాల్లో, ప్రత్తిపాడు నియోజక వర్గంలోని కాకుమాను, తదితర మండలాల్లో అధిక వర్షపాతం నమోదు అయ్యిందన్నారు. అధిక వర్షాలున్న ప్రాంతాల్లోని పంటలను వ్యవసాయ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటకు నష్టం కలిగితే పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించి, పంట నష్టాన్ని తగ్గించాలన్నారు. పంటకు నష్టం జరిగితే ప్రభుత్వం నష్టం జరిగిన సీజన్‌లోనే ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా పరిహారం అందిస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు ధైర్యం చెప్పాలన్నారు. అలాగే జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో అందిన అర్జీలపై జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్ నుండి సమావేశంలో పాల్గొన్న రాజకుమారి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలను సక్రమంగా పరిష్కరించేలా జిల్లాస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సచివాలయాల్లో ప్రభుత్వ సేవలను పెంచేలా యంపీడీఓలు నిరంతరం పర్యవేక్షిస్తూ సచివాలయ ఉద్యోగులకు అవసరమైన సూచనలు అందించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే. చంద్ర శేఖర రావు, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సాయినాథకుమార్, పంచాయితీ రాజ్ ఎస్.ఈ బ్రహ్మయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి రూప్లా నాయక్ , తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

రాష్ట్ర నాయకులతో పసుపు రైతు రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యులు, హాజరైన రైతులు, నాయకులు

ప్రభుత్వంపై వత్తిడి పెంచాలి

స్పందనలో వినతులిచ్చి యంత్రాంగాన్ని కదిలించాలి

దుగ్గిరాల సదస్సులో పసుపు రైతుల సూచన

ప్రజాశక్తి -దుగ్గిరాల : పసుపు సాగుదారులకు గిట్టుబాటు ధరల కోసం రైతులను సమీకరించి అన్ని జిల్లాల్లో రైతు సదస్సులు నిర్వహించి ప్రభుత్వంపై వత్తిడి పెంచాలని పలువురు రైతులు అభిప్రాయపడ్డారు. స్థానిక టెర్మరిక్ అసోసియేషన్ హాలులో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పసుపు రైతుల సదస్సులో వారు మాట్లాడారు. పసుపు పండించడానికి పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందని పంట చేతికి వచ్చిన తరువాత ధరలు లేక నష్టపోతున్నామని తెలిపారు. పెద్ద వ్యాపారస్తులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నిల్వ ఉంచి ధరలు వచ్చినప్పుడు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఎకరాకు రూ.25 నుండి 30 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సదస్సులో రైతుల అభిప్రాయాలు సూచనలు రాష్ట్ర కమిటీ పరిగణలోకి తీసుకోవాలని వారు కోరారు. డెల్టా ప్రాంతంలో భూములు సారవంతమైనప్పటికీ నాణ్యత శాతం తక్కువగా ఉండటంవల్ల ఆశించిన ధరలు రావడం లేదు. పరిశోధన కేంద్రం పెట్టి కొత్త రకాల వంగడాలు అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. ప్రపంచవ్యాప్తంగా పసుపునకు మంచి డిమాండ్ ఉన్నదని, మన దేశంలో కాస్మోటిక్ పరిశ్రమలు ఎందుకు పెట్టరని ఒక రైతు ప్రశ్నించారు. అసలే ధరలు లేక అల్లాడుతుంటే అకాల వర్షాలతో రైతులు నష్టాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అయినకాడికి అమ్ముకుంటున్నాం

నిడుమోలు బసవయ్య, పెసర్లంక, కొల్లూరు మండలం

తాము గత్యంతరం లేక పసుపు పండిస్తున్నాం. ఇతర పంటలు వేసినా పరిస్థితి అలాగే ఉంది. అరటి వేసినా లాభం వస్తుందని గ్యారంటీలేదు. ఏ ధరకు అడిగినా ఇవ్వవలసి వస్తుంది అందువల్ల ధర పెరుగుతుందని ఆశతో పసుపు సాగు చేసి నష్టపోతున్నాము. ధరలు పెరిగే పరిస్థితి కనిపించడం లేదు.

ఈ-నామ్ వల్ల ధరలు తగ్గాయి

బిఎల్‌కె ప్రసాద్‌రావు, కిష్కిందపాలెం, కొల్లూరు మండలం

యార్డులో ఈనామ్ విధానం అమలు పర్చిన తర్వాత ధరలు తగ్గాయి. ఓపెన్ మార్కెట్లో పోటీ విధానం ఉండడంతో వ్యాపారస్తులు కొనుగోలుకు పోటీపడటంతో ధర ఎక్కువుగా ఉండి రైతులకు ప్రయోజం కలిగేది. ప్రస్తుతం వ్యాపారస్తులు కుమ్మక్కై తక్కువ రేటుకు బిడ్డింగులు వేస్తు న్నారు. ఈనామ్ ప్రవేశ పెట్టక ముందు ప్రతిరోజు వేల బస్తాలు అమ్ముడుపోయాయని, ప్రస్తుతం ఆ సంఖ్య వందలకు తగ్గిందన్నారు. ఓపెన్ మార్కెట్లో పది రోజులు వరకు డబ్బులు చెల్లించేవారని, ఇప్పుడు ఆన్లైన్ ద్వారా డబ్బు చెల్లించిన తర్వాతే వ్యాపారస్తులు సరుకును బయటకు తీసుకెళ్లే పరిస్థితి ఉండటంతో కొనుగోలు తగ్గించారన్నారు.

కొత్త వంగడాలు అవసరం

వేములపల్లి వెంకట్రామయ్య, జువ్వలపాలెం, కొల్లూరు మండలం

పదేపదే ఒకే విత్తనం వాడటం వలన దిగుబడి తగ్గుతుంది. పసుపు బోర్డు ఏర్పాటు చేసి కొత్త వంగడాలు అభివృద్ధి చేయాలి. రైతు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఎకరాకు పెట్టుబడివ్యయం రూ.70 వేలు, కౌలు రూ.50వేలు మొత్తంగా లక్ష ఇరవై వేలు అవుతుందని అయితే ఆదాయం రూ.70, 80 వేలకు మించి రావడం లేదని తెలిపారు.

పసుపు రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

తాడేకోరు కొండయ్య, చిర్రావూరు, తాడేపల్లి రూరల్ మండలం

పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే సాగు ఆపే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దున్నినప్పటి నుండి క్రమం తప్పకుండా వర్షం కురుస్తుందని, పసుపు తడిచి నలుపు రంగుగా మారిపోయి, రూ. మూడు నాలుగు వేల కన్నా ఎక్కువ ధర రావటం లేదని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు

రెండో విడత దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : ఉచిత నిర్భంధ విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 12(1) (సి) ప్రకారం 2023-23 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత ప్రవేశాలకు సంబంధించి, రెండో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్ధతిలో ప్రవేశాలు కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో 501 ప్రైవేటు పాఠశాలలు 1వ తరగతిలో అడ్మిషన్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోగా, ఇందులో 5013 ఒకటో తరగతి సీట్లు ఉన్నాయని, వీటిలో 975 మంది దరఖాస్తు చేసుకోగా, 445 మందికి సీట్లు కేటాయించినట్లు చెప్పారు. వారిలో 345 మంది మాత్రమే పాఠశాలల్లో చేరారన్నారు. ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం రిజర్వేషన్ కన్నా తక్కువ దరఖాస్తులు నమోదు అయినందున రెండోవిడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కావున విద్యార్థులు తమ పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవటానికి ఈనెల 6వ తేదీ నుండి 15వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సదుపాయం ఉందన్నారు.

ఎంప్లాయిమెంట్ ఆఫీసులో రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 5న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలైన స్కిల్స్ క్రాఫ్ట్, మాస్టర్ మైండ్స్, శ్రీలక్ష్మి, ఇన్‌ఫ్రా, ఎక్విప్‌మెంట్ వంటి కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. విద్యార్హతనుబట్టి రూ.10వేల నుండి రూ.18వేలు ఉంటుందన్నారు. ఐటిఐ, డిగ్రీ, బీటెక్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, డిప్లొమా చదివిన 18-32 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీ, యువకులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెటు జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని, ఇతర వివరాలకు 98668 22697, 9652065235, 8686057798 నంబర్‌లో సంప్రదించాలన్నారు.